సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 13 । జూన్ । 2023



27 నుంచి సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలు

నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలను ఈనెల 27 నుంచి టీటీడీ తొలిసారిగా నిర్వహించనుంది. - 8లో



మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

ఖరీఫ్‌లో సాగుచేసే పంటలో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు తెలిపారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.300	రూ.360
రెండోరకం	రూ.200	రూ.290



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1248 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	450	530
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 594.98 కిలోలు

న్యూస్‌రీల్

మల్లయ్యకొండపై భక్తుల సందడి



ప్రత్యేక అలంకరణలో మల్లికార్జునస్వామి

తంబళ్లపల్లె : మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు రావడంతో కొండపై సందడి నెలకొంది. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి అభిషేకాలు చేసి స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. గౌరమ్మగుట్టలోని గౌరమ్మకు పూజారి శేఖర్ ప్రత్యేక అలంకరణ, పూజలు, అభిషేకాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు.

అప్రెంటీస్‌కు 42 మంది ఎంపిక

తంబళ్లపల్లె: స్థానిక టిఎన్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో సోమవారం అప్రంటీస్ షిప్ మేళా జరిగింది. సుమారు 70 మంది ఐటీఐ పూర్తి చేసిన వారు పాల్గొన్నారు. కాళహస్తి ఎల్కక్ట్రోల్ కాస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు 22 మందిని, బెంగళూరు ఎల్అండ్‌టీ లిమిటెడ్ వారు 20 మందిని ఎంపిక చేసుకున్నట్లు టీవో నాగరాజు తెలిపారు. ఎంపికైన వారికి ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు.

వీరాంజనేయస్వామి ఆలయ ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

ములకలచెరువు : మండలంలోని సోంపల్లి గ్రామంలో 400 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 15 వరకు ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ ధర్మకర్తలు కిరణ్‌కుమార్, పురుషోత్తం, చెన్నకేశవులు, రాజేంద్ర తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని వారు కోరారు.

ఆయిల్ సీడ్స్ స్థల ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

పీలేరు: పీలేరు పట్టణం తిరుపతి రోడ్డు మార్గంలోని ఆయిల్ సీడ్స్ ఫ్యాక్టరీ (నూనెవిత్తుల కర్మాగారం) స్థలంలో జరిగిన ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ పర్మన్ అహమ్మద్‌ఖాన్‌కు సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ గత కొంత కాలంగా ఆయిల్స్ సీడ్స్ స్థలంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా అక్రమ నిర్మాణాలు అరికట్టి ఆయిల్‌సీడ్స్ స్థలాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సాంబశివ, విశ్వనాథనాయక్, వంగిమళ్ల రంగారెడ్డి, వెంకటేష్, రంగారెడ్డి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

భవన కార్మికుల బోర్డు సభ్యుడిగా రెడ్డెప్ప



కురబలకోట : మండలంలోని ముదివేడుకు చెందిన ఎస్.రెడ్డెప్పను రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తానని ఆయన సోమవారం తెలిపారు. ఈ పదవి రావడానికి కారకులైన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం

మదనపల్లె : మండలంలోని ఈశ్వరమ్మకాలనీ పంచాయతీ ఆటోస్టాండ్ దగ్గర విలువైన ప్రభుత్వ స్థలంలో ప్రైవేట్ వ్యక్తులు షాపురూములు కడుతున్నారని మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షులు గుండామనోహార్ సోమవారం తహసీల్దార్ షేక్‌మహబూబ్ చాంద్‌కు ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారుడు తనకు ఉన్న భూమి కంటే ఎక్కువగా ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నిర్మాణాలు చేస్తున్నాడని చెప్పారు. దీనిపై సచివాలయ వీఆర్వోకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదన్నారు.

విద్యార్థుల బంగారు భవితకు

జగనన్న విద్యా కానుక

- చదువు మాత్రమే పేదవాడి తలరాతను మారుస్తుంది
- నాలుగేళ్లలో రూ.60 వేల కోట్లు విద్యారంగానికి ఖర్చు
- దేశంలో ఎక్కడా లేనివిధంగా పాఠశాల ప్రారంభం రోజే ఉచిత విద్యా కానుక కిట్ల పంపిణీ
- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందజేస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్, ఇతర అతిథులు

రాయచోటి టౌన్: జగనన్న విద్యా కానుక విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తుందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. సోమవారం రాయచోటి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా విద్య, సమగ్ర శిక్ష శాఖల ఆధ్వర్యంలో జిల్లాలో ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు నాలుగో విడత జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ చదువు మాత్రమే పేదవాడి తలరాతను మారుస్తుందన్నారు. విద్యారంగంలో ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొచ్చిందన్నారు. గత నాలుగేళ్లలో రూ.60 వేల కోట్లను విద్యారంగానికి ప్రభుత్వం ఖర్చు పెట్టిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా బడులు తెరిచిన తొలి రోజు నుంచే ఉచిత విద్యా కానుక కిట్లను పంపిణీ చేయడం మనందరికీ గర్వకారణమన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి జిల్లాలో 1709 ప్రాథమిక పాఠశాలలు, 214 ప్రాథమికోన్నత పాఠశాలలు, 296 ఉన్నత పాఠశాలల్లో అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 1,54,789 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను నాడు నేడు కార్యక్రమంతో కార్పొరేటుకు దీటుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో పది నుంచి 15 శాతం విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు.

- మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా మాట్లాడుతూ కులాలు, మతాలకు అతీతంగా ముఖ్యమంత్రి జగనన్న పారదర్శకంగా పాలన చేస్తున్నారని చెప్పారు. విద్యారంగం, వైద్య రంగంలో సంస్కరణలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్నారని పేర్కొన్నారు. డీఈఓ ఎస్. పురుషోత్తం మాట్లాడుతూ పేదరికం ఏ విద్యార్థికి అడ్డు కారాదని అమ్మ ఒడి, విద్యా దీవెన, విద్యా కానుకలను ప్రభుత్వం ఇస్తోందన్నారు. నాడు నేడు ద్వారా ప్రతి విద్యార్థి మంచి వాతావరణంలో చదువుకునేలా ప్రతి పాఠశాలలో వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్, మున్సిపల్ చైర్మన్ చేతులమీదుగా విద్యార్థులకు ఉచితంగా జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ దివాకర్, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, కౌన్సిలర్ నరసింహారెడ్డి, ఎంఈఓ బాలాజీ నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సైదాబాను, పాఠశాల కమిటీ చైర్మన్ స్వర్ణలత, విద్యార్థినులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చదువుల భారాన్ని భుజాలకెత్తుకున్న జగన్ మామ



మాది మధ్యతరగతి కుటుంబం. కార్పొరేట్ పాఠశాలలో చదువుకోవాలంటే ఆ ఫీజుల భారాన్ని మా తల్లిదండ్రులు మోయలేరు. అందుకే నన్ను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. గతంలో మా పాఠశాల పాడుబడి ఉండేది. కానీ నాడు నేడుతో మా పాఠశాల రూపురేఖలే మారిపోయాయి. చదువుకోవడం నాకెంతో ఇష్టం. ప్రభుత్వం ఉచితంగా విద్యా కానుక కిట్లను అందించడం మా అదృష్టం. నేను బాగా చదువుకొని జగన్ మామ పేరు నిలబెడతానని ఆత్మవిశ్వాసంతో చెబుతున్నా. –వర్షిత, పదవ తరగతి, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, రాయచోటి

సీఎం సార్‌కు హ్యాట్సాఫ్



గతంలో పాఠశాలలు తెరిచినప్పటికీ ఆరు, ఏడు మాసాలైనా యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు కూడా రాని పరిస్థితి ఉండేది. స్కూల్లో అంతంత మాత్రమే వసతులు ఉండేవి. ప్రస్తుతం మా పాఠశాలను ఆధునీకరించి అన్ని వసతులను ఏర్పరిచారు. చదువుకోడానికి ఇంత మంచి వాతావరణం ఏర్పరిచిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు. కార్పొరేట్ పాఠశాలలే ప్రభుత్వ బడులతో పోటీపడేలా విద్యార్థులను గ్లోబల్ సిటిజెన్లుగా తీర్చిదిద్దేందుకు విశేషంగా కృషి చేస్తున్న సీఎం సార్‌కు హ్యాట్సాఫ్. –జుబియా, పదవ తరగతి, రాయచోటి ప్రభుత్వ గర్ల్స్ హైస్కూల్

మా పాప బాగా చదువుతోంది



నేను ఆయాగా పని చేస్తాను. నా భర్త నరసింహులు కూలి పని చేస్తాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న మా కుటుంబంలో మా కూతురు పాపనిని కూడా కూలి పనికి పంపాలనుకుంటున్న సమయంలో జగనన్న ప్రభుత్వం వచ్చింది. అమ్మ ఒడితో తోబుట్టువుగా ఆదుకున్నాడు. నాలుగేళ్లుగా అమ్మఒడి అందుకుంటున్నాను. అలాగే మా అమ్మాయికి విద్యా కానుక కిట్లు అందుతున్నాయి. పేద వాళ్లకు చదువును ఇంత దగ్గర చేసినందుకు ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటాం. –ఎస్.రమాదేవి, విద్యార్థిని తల్లి

జగనన్నకు చెబుదాం అర్జీలను సత్వరం పరిష్కరించాలి



వైద్యాధికారుల సమీక్షలో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తోపాటు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణలు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. ఈ స్పందన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో లక్ష్యాలను సాధించాలి

జిల్లాలో ఎన్సీడీ–సీడీ సర్వే వంద శాతం లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వైద్య శాఖకు సంబంధించిన అంశాలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో రక్తహీనతలతో బాధపడుతున్న వారిని గుర్తించి ఎప్పటికప్పుడు రక్తపరీక్షలు నిర్వహించి రక్తహీనత నివారణకు కృషి చేయాలని సూచించారు. ఇంటి వద్దకే వైద్యసేవలు–ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా డయాబెటిస్ హైపర్ టెన్షన్ రోగులకు తరచూ వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో అతిసార ఉధృతి నివారణకు తీసుకున్న చర్యలపై వైద్యాధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ డీఐఓ డాక్టర్ ఉషశ్రీ, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు మెరుగైన వసతులు

డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



మైనార్టీ నాయకులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

రాయచోటి : హజ్ యాత్రికులకు ఏపీ ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పిస్తోందని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. సోమవారం రాయచోటి పట్టణం సుండుపల్లె మార్గంలో నిర్మాణంలో ఉన్న మదరసా ఏ ఇనాయతుల్ మలిక్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా హజ్ యాత్రికులకు సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. హజ్ యాత్రలో సైతం యాత్రికులకు సేవలందించేందుకు 12 మంది డైరెక్టర్లను తోడుగా పంపిస్తున్నామని చెప్పారు. మంత్రి వెంట మదనపల్లె పార్టీ పరిశీలకుడు హబీబుల్లాఖాన్, స్థానిక మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన సామాజిక బాధ్యత

జేసీ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్

రాయచోటి అర్బన్: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడం ఒక సామాజిక బాధ్యత అని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ అన్నారు. ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవ ర్యాలీని ఆయన స్థానిక డైట్ ఉన్నత పాఠశాలలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి ఈడు వయసున్న పిల్లలను పాఠశాలలకు పంపాలన్నారు. స్వచ్ఛంద సంస్థలతో పాటు అన్ని శాఖల అధికారులు బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి, కార్మికశాఖ జిల్లా అధికారి డి.వి.నాగరాజు ,మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఆర్ఐ మల్లికార్జున తదితరులు పాల్గొన్నా రు.

రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించింది కాక మళ్లీ విమర్శలా?

అమిత్‌షా వ్యాఖ్యలపై ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మండిపాటు



ఓబులవారిపల్లె: రాష్ట్రాని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంతో కుమ్మక్కై బీజేపీ అడ్డగోలుగా విభజించింది. ప్రత్యేక హోదా ఇవ్వకుండా సీఎం వైఎస్ జగన్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మండిపడ్డారు. సోమవారం అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె మండలం గాదెల పంచాయతీ తల్లెంవారిపల్లె గ్రామంలో ఉన్నత పాఠశాలను ప్రారంభించి, విద్యార్థులకు విద్యా కానుకను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించి విభజన హామీలు నెరవేర్చకుండా రాష్ట్రానికి అన్యాయం చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఎలా విమర్శిస్తారని ప్రశ్నించారు. ఎంతో ఆదాయం ఉన్న హైదరాబాదును వేరు చేసి విభజించండంతో రాష్ట్రానికి తీరని నష్టం జరిగిందన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో 99 శాతం అమలు చేశారన్నారు. విద్యాభివృద్ధి కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందక ప్రజలు అగచాట్లు పడ్డారని జన్మభూమి కమిటీలతో టీడీపీ కార్యకర్తలకు దోచిపెట్టారని ధ్వజమెత్తారు.

ఉత్సాహంగా... ఉల్లాసంగా

మోగిన బడి గంటలు



పాఠశాలకు వస్తున్న విద్యార్థులు



తండ్రితో పాఠశాలకు వస్తున్న విద్యార్థిని

మదనపల్లె సిటీ: వేసవి సెలవుల తర్వాత జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. ఇన్నాళ్లు ఆటపాటలతో సెలవులను సరదాగా గడిపిన విద్యార్థులు బడులు తెరుచుకున్న తొలిరోజు పాఠశాలల వైపు వడివడిగా అడుగులు వేశారు. వేసవి దృష్టిలో ఉంచుకుని ఒంటిపూట బడులు నిర్వహించారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉదయమే పాఠశాలలకు చేరుకున్నారు. చాలా మంది విద్యార్థులను తల్లిదండ్రులు వెంటబెట్టుకుని వచ్చారు. పాఠశాలలో సందడి నెలకొంది. కొత్తగా పాఠశాలలో చేరేవారు అడ్మిషన్లలో నిమగ్నమయ్యారు. మొదటి రోజు విద్యార్థులకు జగనన్న విద్యాకానుక అందించారు. రాగి జావ, మధ్యాహ్న భోజనం విద్యార్థులకు వడ్డించారు. మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల, నీరుగట్టువారిపల్లె వివేకానంద మున్సిపల్ పాఠశాలల్లో అడ్మిషన్ల సందడి నెలకొంది.



మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రార్థనల్లో విద్యార్థులు

చల్లని కొండ.. మండుతున్న ఎండ

- వేసవిలో హార్సిలీహిల్స్‌పై సాధారణ ఉష్ణోగ్రత 27 డిగ్రీలకు లోపే
- ప్రస్తుతం 35 డిగ్రీలకు పెరిగిన ఉష్ణోగ్రత్రలు
- గతంతో పోల్చితే తగ్గిన పర్యాటకుల సంఖ్య



పర్యాటకుల తక్కువ సంచారంతో బోసిపోతున్న హార్సిలీహిల్స్ రోడ్డు

బి.కొత్తకోట: హార్సిలీహిల్స్...ఈ పేరు వింటేనే ప్రకృతి ప్రేమికులు అబ్బో చలి అంటూ గజగజ వణికిపోతారు. మండువేసవిలోనే కొండకు వెళ్దామంటారు. చలికాలంలో కొండవైపు కన్నెత్తి చూసే సాహసం చేయరు. అలాంటి చల్లటి ప్రాంతమైన బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో ఈ యేడు ఎండలు మండుతున్నాయి. మండు వేసవిలోనూ చల్లదనం, ఆహ్లాదం కలిగించే కొండపై ప్రస్తుతం వేడి గాలులు వీస్తున్నాయి. ఉక్కపోత భరించలేకపోతుండగా గదుల్లో ఫ్యాన్లు, ఏసీలు లేకుండా ఉండలేకపోతున్నారు. వచ్చేరోజుల్లో ఈ పరిస్థితి మరింత దయనీయంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. సముద్రమట్టానికి 4,141 అడుగుల ఎత్తులో ఉన్న హార్సిలీహిల్స్‌కు ఆంధ్రాఊటీగా పేరు. ఎండలు ఎంత మండించినా చల్లటిగాలులు, ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. అయితే ప్రస్తుతం ఎండలు అసాధారణంగా మండిస్తున్నాయి. పట్టణాలు, పల్లెల్లో ప్రజలు ఎండలు, వేడిని భరించలేకపోతున్నారు. దీంతో ఈ ప్రాంతాలకు చెందిన వారు చల్లనికొండ హార్సిలీహిల్స్‌లో సేద తీరుదామని ఇక్కడికి తరలివస్తున్నారు. ఇక్కడి అతిథి గృహాల్లో బస చేస్తున్న వారి సంఖ్య అధికంగా ఉంటోంది. రాష్ట్రానికి చెందిన వారితో పాటు, తమిళనాడు, కర్ణాటకలకు చెందిన పర్యాటకులు అధిక సంఖ్యలోనే వస్తున్నారు. అయితే వారు ఊహించినట్టుగా చల్లటి వాతావరణం లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

ఉక్కపోత, ఎండలు

వేసవిలో హార్సిలీకొండపై ఉష్ణోగ్రత 27 డిగ్రీలకు మించేదికాదు. అలాంటిది ప్రస్తుతం ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం నెలకొంది. ఉష్ణోగ్రతలు తగ్గడం కాదు అమాంతం పెరిగిపోతున్నాయి. ఈ యేడు వేసవిలో ఉష్ణోగ్రత 35 డిగ్రీలకు చేరుకొంది. చల్లదనం కోసం వస్తే మైదాన ప్రాంతంలోని ఎండలే ఉండటంతో పెద్దగా వ్యత్యాసం కనిపించలేదు. సందర్శకుల సంఖ్యాపరంగా చూస్తే సాధారణ సందర్శకులు, పొరుగుజిల్లాలకు చెందినవారే అధికంగా ఉన్నారు. అత్యధికులు రాత్రివేళ కొండపై బస చేసేందుకు ఇష్టపడతారు. ఈమారు వారాంతంలోనే గదులకు డిమాండ్ కనిపించింది. సాధారణ రోజుల్లో గదులు ఖాళీగా ఉన్నాయి. దీన్నిబట్టి చూస్తే కొండపై విడిది చేసేందుకు సందర్శకులు పెద్దగా ఆసక్తి చూపలేదు. దీనికి కారణం ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం.

ఫ్యాన్లు, ఏసీలుంటేనే..

కొండపై ప్రస్తుతం ఫ్యాన్లు, ఏసీలు లేకుంటే ఉండలేని దుస్థితి వచ్చేసింది. కొండపై చల్లగా ఉంటుందని భావించి వచ్చే పర్యాటకులు మారిన వాతావరణంతో టూరిజం, ప్రైవేటు అతిథిగృహాల్లో ఏసీ గదులనే డిమాండ్ చేస్తున్నారు. కొండపై ఇప్పుడున్న ఎండ, వేడిమి గతంలో ఎప్పుడూలేదు. జూన్ రెండో వారంలో ఉన్నప్పటికి ఏప్రిల్ నెల ఎండలే ఉంటున్నాయి. పర్యాటకులు గదుల్లో నుంచి సాయంత్రమైతేకాని బయటకు రాలేని పరిస్థితులున్నాయి. ఇప్పుడు రాత్రిళ్లు దుప్పట్ల అవసరం లేకపోగా వేడికి తాళలేక ఫ్యాన్లు, ఏసీలు వేసుకొని నిద్రించాల్సిన పరిస్థితులు వచ్చాయి. కొన్నేళ్లుగా పర్యావరణం దెబ్బతినడం, విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం, పర్యావరణ కాలుష్యం అధికమైంది. సెల్ టవర్ల రేడియేషన్, చుట్టూ ఉన్న దట్టమైన అడవి నానాటికీ క్షీణించిపోతుండటం ఈ ఉష్ణోగ్రత పెరుగులకు కారణాలుగా కనిపిస్తున్నాయి.

ఘనంగా వాసవీమాత ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మదనపల్లె సిటీ : స్థానిక వాసవీభవన్ వీధిలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ దశమ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఉదయం గణపతిపూజ, స్వస్తివాచనం, నవగ్రహపూజ, కలశ స్థాపన, అభిషేకం నిర్వహించారు. అర్చకులు వేద మంత్రోచ్చారణలతో హోమాలు చేశారు. దశమ వార్షికోత్సవం పురస్కరించుకుని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు ఓంప్రకాష్, గిరిధర్, దేవతా సతీష్, ఆర్యవైశ్య యువజన, మహిళా, అనుబంధ సంఘ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

మదనపల్లె : మద్యం మత్తులో పోలీస్‌స్టేషన్‌లో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు పోలీసుల పైనే దాడికి ప్రయత్నించి, విధులకు ఆటంకం కలిగించిన ఓ వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ మహబూబ్ బాషా తెలిపారు. ఆదివారం రాత్రి నీరుగట్టు వారిపల్లె వద్ద బహిరంగంగా మద్యం సేవిస్తున్న ఏడుగురిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారిలో శ్రీకాంత్ అనే వ్యక్తికి స్టేషన్ బెయిల్ ఇచ్చి తీసుకెళ్లేందుకు బీకే.పల్లెకు చెందిన శీలం జగదీష్‌నాయుడు (31) పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. పోలీసుల అనుమతి లేకుండా శ్రీకాంత్‌ను తీసుకెళ్లేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అతడిని అడ్డుకోవడంతో వారిపై దౌర్జన్యానికి పాల్పడ్డాడు. మద్యం మత్తులో పోలీసులతో వాగ్వివాదానికి దిగి విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో జగదీష్ నాయుడుని అదుపులోకి తీసుకున్నారు. హెడ్‌కాని స్టేబుల్ మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు. ఎస్‌ఐ హరిహర ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫిర్యాదులపై స్పందించాలి



ఫిర్యాదుదారురాలితో మాట్లాడుతున్న ఎస్పీ గంగాధరరావు

రాయచోటి : స్పందన ద్వారా అందుతున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక చొరవచూపాలని జిల్లా ఎస్పీ గంగాధరరావు ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి ఫిర్యాదు దారులకు న్యాయం జరిగేలా చూడాలని అన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

- వేరుశనగ సాగులో విత్తనకాయల పరీక్ష తప్పనిసరి
- వ్యవసాయాధికారుల సూచన



వేరుశనగ పొలాల్లో లోదక్కులు చేస్తున్న రైతు

గుర్రంకొండ : అన్నమయ్య జిల్లాలోని పడమటి మండలాల్లో ముఖ్యమైన పంట వేరుశనగ. 70శాతం మంది రైతులు వేరుశనగ సాగు చేస్తారు. ఖరీఫ్‌సీజన్‌లో సాగుచేసే పంటపై తగినన్ని మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. సాగుకు నెల రోజుల ముందే పొలాల్లో భూసార పరీక్షలు చేయించాలి.తర్వాత విత్తనకాయల పరీక్ష తప్పనిసరిగా చేయించాలి. సాగు సమయంలో విత్తనశుద్ధితో మొక్కలకు సంరక్షణ ఉంటుంది.చాలా మంది రైతులు వీటిపై అవగాహన లేకపోడవంతో తగినంతగా పంటదిగుబడి సాధించలేక నష్టాల పాలవుతున్నారు. జిల్లాలోని అన్ని ఆర్బీకేల్లో ఇప్పటికే రైతులకు అవసరమైన వేరుశనగ విత్తనకాయల పంపిణీ పూర్తి చేసినట్లు చెబుతున్నారు.

విత్తనకాయల పరీక్ష

ఖరీఫ్‌సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేయడానికి ముందుగా విత్తనకాయల పరీక్షను నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో విత్తనకాయల్లో మొలకెత్తే శాతం తెలిసిపోతుంది. ఒకట్రేలో మట్టి, ఇసుకను, ఎరువులతో నింపి 100 విత్తన గింజల్ని నాటాల్సి ఉంటుంది. 12 రోజుల అనంతరం మొలకెత్తే శాతం బట్టి నాణ్యత పరీక్ష తెలుస్తుంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 80 నుంచి 90 శాతం వరకు మొలకెత్తితేనే నాణ్యమైన విత్తనాలుగా నిర్ధారించవచ్చు. కాబట్టి ప్రతి రైతు తాము కొనుగోలు చేసిన విత్తనాలను ముందుగా విత్తనకాయల పరీక్ష చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

రైతులు వేరుశనగ పంట సాగు చేసే పొలాల్లో ఏడాదికొకమారు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలి. పంట సాగు చేసిన ప్రతి సారి భూమిలో నత్రజని, భాస్వరం వినియోగం ఎక్కువగా ఉంటుంది. భూసార పరీక్షల్లో ఎంతమేరకు వీటి శాతం తగ్గిందో తెలుసుకోవచ్చు. తద్వారా పంటసాగు చేసే ముందు పొలంలో తగినంత మేరకు వీటిని పిచికారి చేస్తే భూసారం మళ్లీ యథాస్థితికి చేరుకుంటుందని, మంచి పంట దిగుబడులు సాధించవచ్చని అధికారులు చెబుతున్నారు.

సూక్ష్మపోషకాలు

వేరుశనగ పంట సాగు చేసే పొలాల్లో సూక్ష్మపోషకాల సమతుల్యత సరి చేసుకోవాల్సి ఉంటుంది. పొలాలను దక్కిదున్నే, విత్తనాలు వేసే సమయంలో సూక్ష్మ పోషకాల మందులను వినియోగించాల్సి ఉంటుంది.

బోరాన్, సల్ఫర్

వేరుశనగ సాగులో బోరాన్, సల్ఫర్‌ను తప్పనిసరిగా వినియోగించాలి. తద్వారా కాయలు నాణ్యతగా వస్తాయి. వాటి బరువు కుడా పెరుగుతుంది.

జింక్

జింక్ వినియోగించడం వల్ల మొక్కల్లో కాండం, మొక్క ఎదుగుదల ఎక్కువగా, దృఢంగా ఉంటాయి. అంతేకాకుండా కాయల్లో గింజ ఏర్పడే శాతం కుడా పెరుగుతుంది.

జిప్సమ్

పొలాల్లో జిప్సమ్ చల్లడం వల్ల గింజల్లో నూనెశాతం ఎక్కువగా ఏర్పడుతుంది. పంటపొలాలు దక్కులు చేసే సమయంలో ఎకరానికి 200 కేజీల జిప్సమ్ చల్లాలి. వేరుశనగ సాగులో విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి. డీఎమ్ 45 అనే రకం విత్తనశుద్ధి మందును ఎకరానికి సరిపడే విత్తనగింజల్లో 180 గ్రాములు కలపాల్సి ఉంటుంది. ఈ మందును విత్తనగింజల్లో కలిపిన తరువాతే పొలంలో విత్తాలి. తద్వారా గింజల్ని తినేసే వేరుతొలుచుపురుగులు దూరంగా వెళ్లిపోతాయి. అంతేకాక విత్తనాలు మొలకెత్తే వరకు వాటికి సంరక్షణగా ఉంటాయి.

కలుపు మొక్కల నివారణ

కలుపు మొక్కల నివారణ మందులు తప్పనిసరిగా వాడాలి. పొలంలో విత్తనాలు వేసిన రోజు సాయంకాలంగానీ, ఆ మరుసటి రోజుగానీ ఈ రకం మందులు పిచికారీ చేయాలి. ఎకరం పొలానికి ఒకటిన్నర లీటరు పెండామిథాలిన్ అనే మందును 200 లీటర్ల నీటిలో కలిపి పంటపొలంపై పిచికారీ చేయాలి. ఇలా చేయడం వల్ల విత్తనాలు వేసినప్పటి నుంచి సుమారు రెండు నెలల పాటు కలుపు మొక్కలు పెరగకుండా చూడవచ్చు.

అంతర్ పంటలు

వేరుశనగలో అంతర్ పంటలు కూడా సాగు చేయడం వల్ల పంటకు ఎంతో రక్షణగా ఉంటుంది. పొలంలో విత్తనగింజలు వేసే ఆరుసాళ్ల(వరుసలు)కు ఒకసాలు కందులు, అలసందలు వంటి విత్తనాలు వేయాల్సి ఉంటుంది. పొలం చుట్టూ రెండు నుంచి నాలుగు వరసలు జొన్నలు వేయాలి. వీటి వల్ల పక్కపొలాల నుంచి వైరస్, ఇతర క్రిమికీటకాలు, ఎర్రగొంగళి పురుగులు వేరుశనగ పంటను ఆహించకుండా చేయవచ్చు.



ఆర్బీకేల్లో ట్రేలో ప్రయోగాత్మకంగా చేపట్టిన విత్తనాలు మొలకెత్తే నమూనాలు

విత్తన పరీక్షలు చేయించాం



గుర్రంకొండ మండలంలోని అన్ని ఆర్బీకేల్లో వేరుశనగ విత్తన పరీక్షలు చేయించాం. మొలకెత్తే శాతం ఎక్కువగా ఉన్న విత్తన కాయలకే ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రభుత్వం అన్ని ఆర్బీకేలకు నాణ్యమైన సబ్సిడీ వేరుశనగ విత్తన కాయల్ని సరఫరా చేసింది. పంటసాగులో మెలకువలు పాటిస్తేనే మంచి దిగుబడులు సాధించవచ్చు.

– రత్నమ్మ, వ్యవసాయాధికారిణి, గుర్రంకొండ

పాతకక్షలతో యువకుడి దారుణ హత్య



గణేష్ (ఫైల్)

కేవీపల్లె : పాత కక్షలతో యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన కేవీపల్లె మండలం గాలివారి పల్లె పంచాయతీ బొప్పస ముద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ లోకేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బొప్పసముద్రంకు చెందిన గణేష్ (30), సాంబశివ ఒకప్పుడు స్నేహితులు. ఇద్దరి మధ్య బేదాభిప్రాయాలు రావడంతో శత్రువులుగా మారారు. ఈ క్రమంలో సోమవారం బొప్పసముద్రంలో గణేష్ పైపులైను ఏర్పాటు చేసుకునే క్రమంలో సాంబశివ కుటుంబ సభ్యులతో ఘర్షణ తలెత్తింది. పాత కక్షలు మనుసులో పెట్టుకున్న సాంబశివ, వారి కుటుంబ సభ్యులు కొంతమంది కలసి కొడవళ్లతో దాడి చేసి గణేష్‌ను హతమార్చారు. కాళ్లు, చేతులు, తల నరికేశారు. అడ్డు వచ్చిన గణేష్ తల్లికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. మృతుడికి భార్య తోపాటు కుమారుడు ఉన్నాడు. నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

ఆటో బోల్తా: యువకుడి మృతి

ముద్దనూరు : వైఎస్సార్‌జిల్లా బొందలకుంట సమీపంలో సోమవారం ఆటో బోల్తా పడింది.ఈ ఘటనలో చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన కూలి విశాల్(19) దుర్మరణం చెందాడు. ప్రత్యక్ష సాక్షుల సమాచారం మేరకు చత్తీస్‌ఘడ్‌కు చెందిన నలుగురు కూలీలు బొందలకుంట గ్రామంలో ఇంటి నిర్మాణం పనులకు వెళ్లారు.వీరు ఎర్రగుంట్లలో నివాసముంటున్నారు.పని ముగించుకుని ఆటోలో ఎర్రగుంట్లకు బయలుదేరారు.బొందలకుంట రహదారి మలుపులో ఆటో బోల్తా పడింది.ఈ ప్రమాదంలో విశాల్ మృతి చెందాడు.మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. రామసముద్రం మండలం ఎలవానెల్లూరు పంచాయతీ పిల్లిగుండ్లపల్లెకు చెందిన రెడ్డెప్పరెడ్డి భార్య బి.కవిత(28) బుధవారం ఉదయం ఇంట్లో ఈగలమందు తాగింది. ఇటీవల కుటుంబసభ్యులు ఆమె నగలను బ్యాంకు నుంచి విడిపించి ఇంటికి తెచ్చారు. అయినా ఆమెకు నగలు ఇవ్వలేదన్న కారణంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు రామసముద్రం ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అదేవిధంగా మదనపల్లె పట్టణం అమ్మచెరువుమిట్టకు చెందిన ఫక్రుద్దీన్‌సాబ్ కుమారుడు రహంతుల్లా(55) కుటుంబసమస్యలతో ఫినాయిల్ తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ములకలచెరువు మండలం కాలువపల్లెకు చెందిన బయ్యారెడ్డి కుమారుడు ఎం.రామ్మోహన్(20) కొంతకాలం క్రితం ప్రమాదం కారణంగా ఆపరేషన్ జరిగింది. అయితే బుధవారం ఆపరేషన్ చేసుకున్నా అనారోగ్యం తగ్గకపోవడంతో భరించలేక పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అవుట్‌పోస్ట్ సిబ్బంది సంబంధిత సమాచారాన్ని ఆయా పోలీస్‌స్టేషన్ అధికారులకు తెలిపారు.

లోకేష్ పాదయాత్రలో అపశ్రుతి

బద్వేలు అర్బన్ : నారాలోకేష్ యువగళం పాదయాత్రలో అపశ్రుతి చోటు చేసుకుంది. సోమవారం సాయంత్రం వైఎస్సార్ జిల్లా విద్యానగర్ విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభించిన కొద్దిసేపటికే కార్యకర్తలు టపాసులు పేల్చడంతో నిప్పురవ్వలు ఎగిసిపడి విద్యానగర్ సమీపంలో ఆర్.విజయమ్మ, ఆర్.నాగమ్మలకు చెందిన గడ్డివాములు దగ్ధమయ్యాయి. స్థానికులు వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలు ఆర్పివేశారు. వేసవికాలం పశువులకు మేత దొరకని కష్ట సమయంలో ఉన్న గడ్డివాములు దగ్ధమవడంపై మహిళలు బోరున విలపించారు. ఈ ఘటనలో సుమారు రూ.70 వేలు నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు.

27 నుంచి సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీపీ మేడావిజయభాస్కర్‌రెడ్డి, డిప్యూటీఈవో నటేష్‌బాబు

నందలూరు(రాజంపేట) : జిల్లాలో ప్రసిద్ధి చెందిన నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) తొలిసారిగా నిర్వహించనుంది. ఈనెల 27 నుంచి జరిపేందుకు సన్నాహాలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, డిప్యూటీఈవో నటేష్‌బాబు ఆలయంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ మాజీ ఛైర్మన్ అరిగెల సౌమిత్రితో కలిసి ఆలయం వారితో చర్చలు జరిపారు. ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల తరహాలోనే సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారనే భావనలో భక్తులు ఉన్నారని, ఆ విధంగా చేయాలని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి నేతృత్వంలో టీటీడీ ఛైర్మన్ వైవీసుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డిలతో మాట్లాడతామని చెప్పారు.

బ్రహ్మోత్సవాల్లో స్వామివారు ఊరేగే వాహనాలను సిద్ధం చేస్తున్నారు.స్వామి కల్యాణోత్సవం నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు కూడా టీటీడీ దృష్టి సారించింది. ఈసందర్భంగా టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్ బాబు మాట్లాడుతూ స్వామివారి బ్రహ్మోత్సవాలకు సంబంధించి ప్రచార సామగ్రి సిద్ధమవుతోందన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణ విషయంలో దాతల భాగస్వామ్యం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సౌమ్యనాథాలయ మాజీ ఛైర్మన్ అరిగెల సౌమిత్రి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దిలీప్, మండల కో–ఆప్షన్ సభ్యుడు కలీం, వైఎసాసర్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధానకార్యదర్శి నడివీధి సుధాకర్, నాయకులు తుమ్మల శ్రీధర్ గౌడ్, రైల్వేభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని యువకుడి ఆత్మహత్య



బాలకృష్ణ(ఫైల్)

మదనపల్లె : తండ్రి మందలించాడని భవననిర్మాణ కార్మికుడుగా పనిచేస్తున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. వలసపల్లె పంచాయతీ కృష్ణాపురం జ్యూస్‌ఫ్యాక్టరీ సమీపంలో నివాసం ఉన్న రమణ రెండో కుమారుడు బాలకృష్ణ(22) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అవివాహితుడు. కొంతకాలంగా పనులకు సక్రమంగా వెళ్లకుండా, సెల్‌ఫోన్‌లో ఎక్కువ సమయం చాటింగ్ చేస్తుండటంతో సోమవారం ఉదయం తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన బాలకృష్ణ ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. తాలూకా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో..

కడప అర్బన్ : కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామరాజుపల్లిలో వరప్రకాష్ రావు (45) అనే వ్యక్తి అప్పుల బాధ తాళలేక సోమవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతనికి భార్య సబిత, కుమారుడు ఉన్నారు. ఈఎంఐలు చెల్లించలేక ఈ చర్యకు పాల్పడ్డాడని భార్య తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప తాలూకా సీఐ ఉలసయ్య తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన ద్విచక్రవాహనం

పీలేరురూరల్ : లారీ – ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికీ గాయాలైన సంఘటన పీలేరు పట్టణం నాలుగు రోడ్ల కూడలిలో చోటు చేసుకుంది. పీలేరు మండలం అగ్రహారం పంచాయతీ కంభంమిట్టపల్లెకు చెందిన వెంకటేశ్వర్‌రావు (40), దామోదర్‌రావు (27) ద్విచక్రవాహనంలో పీలేరుకు వచ్చారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో రాయచోటి వైపు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్‌రావు, దామోదార్‌రావు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో, ట్రాక్టర్ ఢీకొని..

మదనపల్లె : ఆటోను ట్రాక్టర్ ఢీకొన్న రోడ్డుప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లె మండలంలో జరిగింది. కాటిపేరి పంచాయతీ అగస్తిగానిపల్లెకు చెందిన ఎగువమిద్దె రాజమ్మ(50), యు.రెడ్డెప్ప(60), అతని కుమారుడు శేఖర్(40)లతో కలిసి 12 మంది ప్రయాణికులు కాగతి నుంచి ఆటోలో గ్రామానికి బయలుదేరారు. గిరిజాపురం వద్ద ఆటోను ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో అగస్తిగానిపల్లెకు చెందిన రాజమ్మ(50), తండ్రీ కొడుకులు రెడ్డెప్ప, శేఖర్‌లు తీవ్రంగా గాయపడ్డారు. రాజమ్మను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మిగిలిన బాధితులను పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

వైఎస్సార్‌సీపీలో 50 కుటుంబాలు చేరిక



ముద్దా బాబుల్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన వడ్డిపల్లి గ్రామస్తులు

పుల్లంపేట : రంగంపల్లి పంచాయతీలోని వడ్డిపల్లి గ్రామానికి 50 కుటుంబాల వారు సోమవారం పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము వైఎస్సార్‌సీపీలో కొనసాగుతామని, తామంటే గిట్టనివారు సోషల్ మీడియాలో జనసేన పార్టీలోకి వెళ్లామని దుష్ప్రచారం చేశారన్నారు. అందువల్ల పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు తెలియజేశారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

హార్డ్‌వేర్స్ దుకాణం దగ్ధం: రూ.30లక్షల నష్టం



దుకాణంలో ఎగిసి పడుతున్న మంటలు

వాల్మీకిపురం : స్థానిక తరిగొండ రోడ్డులోని ఎంకె హార్డ్‌వేర్ షాపులో సోమవారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి భారీ నష్టం వాటిల్లింది. గుర్రంకొండ మండలం మర్రిపాడుకు చెందిన జుబేర్, ఉమ్మర్ వాల్మీకిపురంలోని తరిగొండ రోడ్డులో సొంత దుకాణం నిర్మించుకొని హార్డ్‌వేర్ షాపు నిర్వహిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. దుకాణంలో పెయింట్స్, ప్లాస్టిక్, కెమికల్స్‌కు సంబంధించిన వస్తువులు ఉండడంతో పాటు గోడౌన్ కూడా ఫస్ట్ ఫ్లోర్‌లో ఉంది. అందులోనూ ఎలక్ట్రిక్ వస్తువులు, పెయింట్స్ ఉన్నాయి.ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో రెండు ఫ్లోర్‌లలోని వస్తువులు అంటుకున్నాయి. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడటంతో భవనం మొత్తం కాలిపోయింది. దీంతో హార్డ్‌వేర్ దుకాణంలో దాదాపు రూ. 30లక్షలు నష్టం వాటిల్లింది. సకాలంలో సంఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, పంచాయతీ ఉపసర్పంచ్ కేశవ రెడ్డి పంచాయతీ ట్యాంకర్లను తెప్పించారు. స్థానిక యువకుల సహకారంతో మంటలను అదుపుచేశారు. పోలీసులు సంఘటనకు దారి తీసిన అంశాలపై ఆరా తీస్తున్నారు.

సహజవాయువుల కోసం అన్వేషణ



కోనవారిపల్లె గ్రామం వద్ద బోరుబావి తవ్వుతున్న దృశ్యం

కొండాపురం : భూమిలో దాగి ఉన్న సహజవాయువు నిక్షేపాల కోసం సర్వే జరుగుతోంది. మండలంలోని పలు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ సంస్థ ఓఎన్‌జీసీ (ఆయిల్, నేచురల్‌గ్యాస్ కార్పొరేషన్) నియమించిన బృందం జల్లెడ పడుతోంది. సోమవారం వైఎస్సార్ జిల్లా కోనవారిపల్లె,కె.సుగుమంచిపల్లె, బురుజుపల్లె రెవెన్యూ పొలాల్లో పరిశోధనలు జరిగాయి. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో భూమిలోని చమురు,సహజవాయువుల నిక్షేపాల శాతాన్ని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో డ్రిల్లింగ్ పనులను ప్రారంభించారు. 30 నుంచి 35 మీటర్లవరకు బోరుబావులు తవ్వుతున్నారు. సర్వే పనులు పూర్తి కావడానికి రెండు నెలలు పడుతుందని సంస్థ అధికారులు చెబుతున్నారు.

కేవీకే రైతుకు రాష్ట్రస్థాయి పురస్కారం



అతిథుల నుంచి పురస్కారం అందుకుంటున్న రైతు మోపూరు శ్రీనాథరెడ్డి

కడప అగ్రికల్చర్ : ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 59వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా రాష్ట్రస్థాయి పురస్కారాలను అందజేస్తారు. ఇందులో భాగంగా 2023 సంవత్సరానికి కడప ఊటుకూరు కృషి విజ్ఞానకేంద్రం(కేవీకే) అభ్యుదయ రైతు, ఉమ్మడి వైఎస్సార్ జిల్లా రామాపురం మండలం రాచపల్లి గ్రామానికి చెందిన మోపూరు శ్రీనాథరెడ్డికి పురస్కారం లభించింది.వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ నిర్వహణ తదితరల వ్యూహాలను అదించడంతో ఆయన రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికయ్యారు. గుంటూరు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గౌరవ ఉపకులపతి డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, పూర్వ ఉపకులపతి రఘువర్ధన్‌రెడ్డి, న్యూఢిల్లీ భారత వ్యవసాయ పరిశోధన సంస్థ పూర్వపు కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ త్రిలోచన్ మహాపాత్ర హాజరయ్యారు. శ్రీనాథరెడ్డికి రూ. 25 వేల నగదు, పురస్కారం, జ్ఞాపికను అందజేశారు.